



Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక






ఆదివారం 19-07-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :32 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్


# కరెన్సీలో విప్లవం

# కాగితానికి గుడ్‌బై!



- రూ.10, రూ.20తో పైలట్ ప్రారంభం
- ప్లాస్టిక్ నోట్లకు ఆర్‌బీఐ గ్రీన్ సిగ్నల్
- ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ టెండర్
- 2027 నాటికి పూర్తి స్థాయి అమలు లక్ష్యం
- నకిలీకి చెక్ పెట్టే భద్రతా ఫీచర్లు
- చైనా, పాక్ కంపెనీలపై కఠిన షరతులు
- అనుభవం ఉన్న సంస్థలకే అవకాశం
- 50కిపైగా దేశాల్లో ఇప్పటికే వినియోగం
- ఆగస్టు 18 వరకు బిడ్లకు గడువు


**న్యూస్ డెస్క్, 18 జూలై (ఇది కద నిజం):** భారత్‌లో కరెన్సీ వ్యవస్థలో మరో కీలక మార్పుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీకారం చుట్టింది. భవిష్యత్తులో పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టేందుకు ఆర్‌బీఐ సన్నాహాలు ప్రారంభించింది. తొలి దశలో రూ.10, రూ.20 డినామినేషన్ నోట్లను పాలిమర్ మెటీరియల్‌తో ముద్రించే పైలట్ ప్రాజెక్ట్ చేపట్టే అవకాశమున్నట్లు సమాచారం. ఇందుకోసం ప్రపంచవ్యాప్తంగా తయారీ సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ గ్లోబల్ టెండర్ జారీ చేసింది.

మొదట పైలట్ ప్రాజెక్ట్.. తర్వాత పూర్తి స్థాయి అమలు

అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, తొలుత రూ.10, రూ.20 నోట్లతో ప్రయోగాత్మకంగా ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. ఫీల్డ్ ట్రయల్స్ విజయవంతమైతే 2027 నాటికి పెద్ద ఎత్తున పాలిమర్ నోట్లను చలామణిలోకి తీసుకురావాలని ఆర్‌బీఐ భావిస్తోంది. మిగతాది 2 లో..

# జాతీయ గేయానికి రక్షణ

- మూడేళ్ల జైలు శిక్ష
- కేంద్రం సరికొత్త బిల్లు
- వందేమాతరానికి చట్టబలం
- పార్లమెంట్‌లో కీలక ప్రతిపాదన
- జాతీయ గేయానికి రక్షణ
- అవమానిస్తే కఠిన చర్యలు



2 లో

**న్యూస్ డెస్క్, 18 జూలై (ఇది కద నిజం):** జాతీయ గీతం 'జనగణమన' లేదా మువ్వన్నెల జెండాను అవమానిస్తే ఎంతటి కఠిన శిక్ష పడుతుందో మనందరికీ తెలిసిందే. త్వరలోనే మన జాతీయ గేయం 'వందేమాతరం' విషయంలోనూ ఇదే విధమైన చట్టం రాబోతోంది. వందేమాతరం ఆలపించకుండా అడ్డుకున్నా లేదా దాన్ని అవమానించినా మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించేలా కేంద్ర ప్రభుత్వం సరికొత్త బిల్లును తీసుకువస్తోంది. రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనే ఈ బిల్లును ప్రవేశపెట్టేందుకు కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం అమలులో ఉన్న 1971 నాటి 'జాతీయ గౌరవ అవమానాల నిరోధక చట్టం'కి సవరణలు చేస్తూ

# చరిత్ర సృష్టించిన విక్రమ్-1



# జగన్ వారసుడు బాబు

- తల్లులకు మోసం
- 20 లక్షలకే అన్యాయం
- సూపర్ సిక్స్ ప్రశ్న
- హామీలపై షర్మిల ఫైర్
- కూటమిపై తీవ్ర విమర్శలు


2 లో

**న్యూస్ డెస్క్, 18 జూలై (ఇది కద నిజం):** ఏపీలో గత వైసీపీ ప్రభుత్వ మోసాలను నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు తూచ తప్పకుండా పాటిస్తున్నారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. వైఎస్ జగన్‌కు వారసుడి గా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని ట్విటర్ వేదికలో విమర్శించారు.

తల్లికి వందనానికి పంగనామం–బిడ్డలకు ఎగనామం ఇదే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీ అని పేర్కొన్నారు. అమ్మఒడి పేరుతో ఒక్కబిడ్డకే ఇచ్చి వైసీపీ ప్రభుత్వం తల్లులను పచ్చిమోసం చేస్తే, ఒక్కో బిడ్డకు రూ.15 వేలు అంటూ హామీ ఇచ్చి రూ.13 వేలు ఇస్తూ తల్లులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

# అందెశ్రీ నాకు స్ఫూర్తి.. పెద్దన్న లాంటి వ్యక్తి


2 లో

- ఏడాదిలోనే 70 వేల ఉద్యోగాలు
- కేసీఆర్‌పై రేవంత్ విమర్శలు
- నోటిఫికేషన్లపై ఘాటు వ్యాఖ్యలు
- యువతకు ఉద్యోగాలే లక్ష్యం
- తెలంగాణ గీతానికి గుర్తింపు
- దొర అహంకారంపై ఫైర్

# జంతర్‌మంతర్‌లో ఉద్రిక్తత


2 లో

- నిరాహార దీక్షలోకి అభిజీత్ దీప్కే
- జంతర్ మంతర్‌లో ఉద్రిక్త పరిస్థితులు
- జూలై 20న పార్లమెంట్ ముట్టడికి పిలుపు
- ఉద్యమం కొనసాగుతుందని సీజేపీ స్పష్టం
- పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు

# నిరూపిస్తే రాజకీయాలకు గుడ్‌బై


2 లో

- 70 వేల ఉద్యోగాలు నిరూపించండి..
- రాజకీయం వదిలేస్తా!
- ఉద్యోగాలపై కేటీఆర్ బహిరంగ సవాల్
- 70 వేల ఉద్యోగాలపై కేటీఆర్ ఛాలెంజ్
- ఉద్యోగాలే అజెండా.. కేటీఆర్ ఫైర్

**న్యూస్ డెస్క్, 18 జూలై (ఇది కద నిజం):** హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన బీఆర్ఎస్ యువజన సభలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణమైన యూత్ డిక్లరేషన్ హామీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని అన్నారు. ఇదే సరూర్‌నగర్ వేదికపై కాంగ్రెస్ నిరుద్యోగ యువతను మోసం చేసిందని ఆయన అన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 30 నెలలు దాటినా యువతకు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు కాలేదని కేటీఆర్ విమర్శించారు. ప్రైవేట్ కంపెనీల్లో రిజర్వేషన్లు, మహిళలకు స్కూటీలు, భారీ ఉద్యోగ నియామకాలు వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఢిల్లీ నుంచి గాంధీలు, గాంధీభవన్ నుంచి గాడ్సేలు వచ్చి యువతను మోసం చేశారని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. "కాంగ్రెస్ ప్రభుత్వం 70 వేల ఉద్యోగాలు ఇచ్చిందని నిరూపిస్తే నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడమే కాకుండా, శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటాను" అని అన్నారు.

# మెక్సికోలో భారీ భూకంపం

- 7.4 తీవ్రతతో భూకంపం
- భూకంపంతో సునామీ హెచ్చరికలు
- తీరప్రాంతాలకు సునామీ అలర్ట్
- భూకంపంతో ప్రజల్లో భయాందోళన
- మెక్సికో తీరాన్ని వణికించిన భూకంపం
- రిక్టర్‌పై 7.4 తీవ్రత

2 లో

# గుడిసెలులేని తెలంగాణ లక్ష్యం

- రూ.184 కోట్ల రోడ్ల పనులకు శంకుస్థాపన
- పేదలందరికీ రూ.5 లక్షలతో పక్కా ఇల్లు
- రెండో విడత ఇళ్ల నిర్మాణానికి సన్నాహాలు
- వికారాబాద్ రోడ్లకు రూ.900 కోట్ల నిధులు
- పరిశ్రమలతో స్థానిక యువతకు ఉపాధి
- సంక్షేమ పథకాల అమలుపై మంత్రి వివరణ
- పరిగి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబాటు


2 లో

**న్యూస్ డెస్క్, 18 జూలై (ఇది కద నిజం):** తెలంగాణ రాష్ట్రంలో గుడిసెలు లేకుండా ప్రతి నిరుపేద కుటుంబానికి పక్కా ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో రూ.184.15 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు.

# పాక్ కాల్పులు

## భారత సైన్యం ప్రతిదాడి

- ఎల్‌వోసీ వెంబడి భారీ కాల్పులు
- ఆపరేషన్ సింధూర్ తర్వాత ఉద్రిక్తత
- పాక్ కాల్పులకు భారత్ ధీటైన జవాబు
- మళ్లీ భగ్గుమన్న భారత్-పాక్ సరిహద్దు
- సరిహద్దులో కాల్పుల కలకలం
- ఎల్‌వోసీపై మళ్లీ ఉద్రిక్తత

# విజయవాడలో డయేరియా కలకలం

- కలుషిత నీటితో 13 మంది అస్వస్థత
- వాంతులు, విరేచనాలతో ఆస్పత్రికి తరలింపు
- గిరిపురంలో మెడికల్ క్యాంపుల ఏర్పాటు
- తాగునీటి నమూనాలు ల్యాబ్‌కు పంపింపు
- డ్రైనేజీ నీళ్లే కారణమంటున్న స్థానికులు
- అప్రమత్తమైన వైద్య, మున్సిపల్ అధికారులు
- డయేరియాతో విజయవాడలో హెల్త్ అలర్ట్

2 లో

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
ఆదివారం 19-07-2026

# చరిత్ర సృష్టించిన విక్రమ్-1

**న్యూస్ డెస్క్, 18 జూలై (ఇది కద నిజం):** భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్ర సృష్టిస్తూ.. విక్రమ్ -1 రాకెట్ అంతరిక్షంలోకి దూసుకెళ్లింది. షెడ్యూల్ ప్రకారం శనివారం ఉదయం 11:30 గంటలకు శ్రీహరికోట నుంచి నింగిలోకి దుసుకెళ్లాల్సిల్సీ ఉండగా.. అయితే కౌంట్ డౌన్ కొనసాగుతున్న క్రమంలో లాంచ్ కు ఐదు నిమిషాల ముందు సాంకేతిక సమస్యను గుర్తించిన శాస్త్రవేత్తలు ప్రస్తుతానికి ప్రయోగం వాయిదా వేసినట్లు ప్రకటించారు. అనంతరం సమస్యను గుర్తించి సాల్వ్ చేసిన శాస్త్రవేత్తలు ఐదు నిమిషాల ఆలస్యం తర్వాత మరోసారి కౌంట్ డౌన్ స్టార్ట్ చేశారు. దీంతో 12.05 నిమిషాలకు విక్రమ్-1 రాకేట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లి చరిత్ర సృష్టించింది.

నిప్పులు చిమ్ముతూ ఆకాశంలోకి దూసుకెళ్లిన విక్రమ్-1.. తన ప్రయాణంలో భాగంగా మొదట నిర్దేశిత మొదటి దశను విజయవంతంగా పూర్తి చేసుకుని రెండో దశలోకి ప్రవేశించింది. ఆ తర్వాత అత్యంత కీలకమైన రెండో దశ, మూడ, కీలకమైన నాలుగో దశను కూడా విజయవంతంగా ముగించుకుని, నిశ్చయించిన కక్ష్య వైపుగా అంతరిక్షంలోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. ప్రయోగం ఆశించిన రీతిలో విజయవంతం కావడంతో శ్రీహరికోట కంట్రోల్ రూమ్‌లోని స్కైరూట్, ఇస్రో శాస్త్రవేత్తలు హర్షధ్వానాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు.

# జంతర్‌మంతర్‌లో ఉద్రిక్తత



**న్యూస్ డెస్క్, 18 జూలై (ఇది కద నిజం):** ఢిల్లీలోని జంతర్ మంతర్ లో టెన్షన్ వాతావరణం నెలకొంది. 21 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను శనివారం ఉదయం ఢిల్లీ పోలీసులు బలవంతంగా సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ఈ పరిణామంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వాంగ్‌చుక్‌ను తరలించిన వెంటనే రంగంలోకి దిగిన సీజేపీ వ్యవస్థాపక అధ్యక్షుడు అభిజిత్ దీప్కే కీలక ప్రకటన చేశారు. సోనమ్ వాంగ్‌చుక్ తరలింపునకు నిరసనగా తాను ఇప్పటి నుంచే నిరాహార దీక్షను ప్రారంభిస్తున్నట్లు దీప్కే ప్రకటించారు.

ఉద్యమం ఆగదు:

మా ఉద్యమం ఆగదని ఈ నెల 20వ తేదీన పార్లమెంట్ ముట్టడి చేసి తీరుతామని అభిజిత్ స్పష్టం చేశారు. సోనమ్ వాంగ్?చుక్?ను పోలీసులు బలవంతంగా తీసుకెళ్లారని.. జంతర్ మంతర్?కు వెళ్తుండగా పోలీసులు నాపై దాడి చేశారని ఆరోపించారు. పోలీసులు ఆర్ఎస్ఎస్ గుండాల్లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎవరూ వెనక్కి తగ్గవద్దని ఈ ఉద్యమం మరింత ఉధృతం అవుతుందన్నారు. అందరూ జంతర్ మంతర్ వద్దకు తరలిరావాలని కోరారు. మా నిరసన ఇక్కడి నుంచే కొనసాగుతుందని ముందుగా ప్రకటించినట్లుగా జూలై 20న చేపట్టే మార్చ్ యథాతథంగా కొనసాగుతుందని ప్రకటించారు. వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించినప్పటికీ ఉద్యమం ఆగే ప్రసక్తే లేదని ఆయన నొక్కి చెప్పారు.

# నిరూపిస్తే రాజకీయాలకు గుడ్‌బై

మొదటి పేజీ తరువాయి

రేవంత్ రెడ్డి ఉద్యోగాలు ఇవ్వనని మాట్లాడుతున్నారని ఆరోపించిన కేటీఆర్.. "తెలంగాణ ఏమైనా నీ అయ్య జాగీరా?" అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి అహంకారం పెరిగిపోయిందని విమర్శించారు. గతంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులను "బీరు, బిర్యానీ బ్యాచ్" అని వ్యాఖ్యానించడం బాధాకరమన్నారు.

నిరుద్యోగ యువతలో తీవ్ర అసంతృప్తి ఉందని, వారికి ఆకలి ఉద్యోగాల కోసమేనని కేటీఆర్ పేర్కొన్నారు. యువశక్తి ఒక్కసారి పోటెత్తితే అధికార పీఠాలు కదిలిపోతాయని హెచ్చరించారు. చివరగా రేవంత్ రెడ్డి పాలనకు ముగింపు హిట్లర్ ముగింపుకంటే దారుణంగా ఉంటుందని వ్యాఖ్యానించారు.

# విజయవాడలో డయేరియా కలకలం



**న్యూస్ డెస్క్, 18 జూలై (ఇది కద నిజం):** విజయవాడ గిరిపురంలో డయేరియా కలకలం రేగింది. కలుషిత నీరు తాగి 13 మంది అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించడంతో 10 మంది సురక్షితంగా డిశ్చార్జి అయ్యారు. మరో ముగ్గురికి వైద్యం కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. గిరిపురంలో అధికారులు పర్యటించారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ఇంటింటికి వెళ్లి స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తాగునీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. నీటి నాణ్యతపై పీఎంసీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. గిరిపురం ప్రాంతంలో అంతా కూలీ పనులు చేసుకునే వాళ్లమని నల్లా నీళ్లపైనే 90 శాతం ప్రజలు ఆధారపడి బతుకున్నామని, డ్రైనేజీ నీళ్లు కలవడం వల్లే అస్వస్థతకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దోమలు కూడా విపరీతంగా ఉన్నాయని తెలిపారు. అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడంలేదని వాపోయారు.

# జాతీయ గేయానికి రక్షణ

మొదటి పేజీ తరువాయి

'ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ హానర్ (అమెండ్‌మెంట్) బిల్లును తీసుకురానున్నారు. దీని ద్వారా జాతీయ గీతం, రాజ్యాంగం, జాతీయ జెండాతో సమానంగా వందేమాతరానికి కూడా పూర్తి చట్టపరమైన రక్షణ లభిస్తుంది. వందేమాతరం రచించి 150 ఏళ్లు పూర్తవుతున్న తరుణంలో ప్రభుత్వం ఈ ఏడాది పొడుగునా ఉత్సవాలను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలోనే జాతీయ గేయానికి మరింత ప్రాధాన్యత కల్పించేలా కేంద్రం అడుగులు వేస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్ర హోంశాఖ అన్ని రాష్ట్రాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. జాతీయ గీతాన్ని ఆలపించే అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరాన్ని కూడా తప్పనిసరిగా పాడాలని స్పష్టం చేసింది. అయితే, ఈ నిర్ణయం వెనుక రాజకీయ వ్యూహాలు కూడా ఉన్నాయని విశ్లేషకులు భావించారు. ఈ పాటను బెంగాలీ నవలా రచయిత బంకిం చంద్ర ఛటోపాధ్యాయ 1875లో రాయగా, 1882లో ఆయన రాసిన 'ఆనందమఠ్' నవలలో ఇది ప్రచురితమైంది. సరిగ్గా బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ ఉత్తర్వులు రావడం రాజకీయ దుమారం రేపింది. ఆ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి, అక్కడ తొలిసారి ప్రభుత్వాన్ని కూడా ఏర్పాటు చేసింది. తాజాగా హోంశాఖ రాష్ట్రాలకు మరో లేఖ రాస్తూ.. అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గీతం కంటే ముందే జాతీయ గేయం వందేమాతరాన్ని ఆలపించాలని, పైగా వందేమాతరంలోని మొత్తం ఆరు చరణాలను (సుమారు 3 నిమిషాల 10 సెకన్ల పాటు) పూర్తిగా పాడాలని ఆదేశించింది. వందేమాతరంలోని అన్ని చరణాలను పూర్తిగా పాడాలన్న ఈ నిర్ణయం వెనుక ఒక సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర ఉంది. 1937లో జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ వందేమాతరంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని నిర్ణయించింది. ఈ పాటలోని తర్వాతి చరణాల్లో హిందూ దేవతల ప్రస్తావన ఉండటం పట్ల ముస్లిం వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవడమే ఇందుకు కారణం. ఈ చారిత్రక అంశాన్ని అస్త్రంగా చేసుకుని బీజేపీ ఇప్పుడు కాంగ్రెస్ మీద విమర్శల దాడికి దిగుతోంది. కాంగ్రెస్‌కు వందేమాతరం అంటేనే ద్వేషమని బీజేపీ జాతీయ ప్రతినిధి షెహజాద్ పూనావాలా తీవ్ర ఆరోపణలు చేశారు. ముస్లిం లీగ్ ఒత్తిడికి తలొగ్గి నెహ్రూ ఈ జాతీయ గేయాన్ని రెండు ముక్కలు చేశారని, కేవలం రెండు చరణాలు ఉన్నప్పటికీ కాంగ్రెస్ నేతలు దాన్ని పాడటానికి నిరాకరించేవారని ఆయన విమర్శించారు.

# కరెన్సీలో విప్లవం కాగితానికి గుడ్‌బై!

మొదటి పేజీ తరువాయి



ఈ ప్రాజెక్టు విజయవంతమైతే భవిష్యత్తులో మరిన్ని డినామినేషన్లకు కూడా ఈ విధానాన్ని విస్తరించే అవకాశం ఉంది.

గ్లోబల్ టెండర్ ఎందుకు?

రిజర్వ్ బ్యాంక్‌కు చెందిన కరెన్సీ ముద్రణ సంస్థ భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోట్ ప్రింటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ భద్రతా లక్షణాలతో కూడిన పారదర్శక పాలిమర్ సబ్‌స్ట్రేట్ షీట్ల సరఫరా కోసం ప్రపంచవ్యాప్తంగా తయారీదారులను ఆహ్వానించింది. సుమారు 68,000 రీముల BOPP (Biaxially Oriented Polypropylene) ఆధారిత పాలిమర్ సబ్‌స్ట్రేట్ కొనుగోలు చేయాలని టెండర్‌లో పేర్కొంది. ఇందులో రెండు వేర్వేరు కరెన్సీ డినామినేషన్ల కోసం చెరో 34,000 రీములు కేటాయించనున్నారు. ప్రతి రీములో 500 షీట్లు ఉంటాయి.

ప్లాస్టిక్ నోట్లలో ఉండే భద్రతా ఫీచర్లు

పాలిమర్ నోట్లు సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే మరింత అధునాతన భద్రతా లక్షణాలను కలిగి ఉంటాయి.

పారదర్శక విండో
లోహపు అంకెలు
అయస్కాంత భద్రతా దారం
వాటర్‌మార్క్ తరహా నీడ చిత్రం
ఇరిడెసెంట్ డిజైన్

వంటి ప్రత్యేక భద్రతా అంశాలు ఉండనున్నాయి. వీటి కారణంగా నకిలీ నోట్ల తయారీ మరింత కష్టతరం అవుతుంది.

టెండర్‌లో కఠిన నిబంధనలు

ఈ గ్లోబల్ టెండర్‌లో పాల్గొనే కంపెనీలకు ఆర్‌బీఐ కఠిన అర్హతలు విధించింది. చైనా, పాకిస్తాన్‌లలోని కార్యకలాపాలు భారత ప్రాజెక్టుతో ఎలాంటి సంబంధం లేకుండా ఉండాలని స్పష్టం చేసింది. అలాగే ఆ దేశాల నుంచి ముడి పదార్థాలు సేకరించకూడదని, గతంలో అక్కడ పనిచేసిన సిబ్బందిని ఈ ప్రాజెక్టులో నియమించకూడదని షరతులు విధించింది. భారత్‌తో భూ సరిహద్దు పంచుకునే దేశాలకు చెందిన సంస్థలు పరిశ్రమల ప్రోత్సాహక మరియు అంతర్గత వాణిజ్య శాఖ రిజిస్ట్రేషన్ కమిటీలో నమోదు అయి ఉండాలి.

ఎవరు టెండర్‌కు అర్హులు?

టెండర్‌లో పాల్గొనే సంస్థలు కనీసం మూడు సంవత్సరాల పాటు సెంట్రల్ బ్యాంకులు లేదా కరెన్సీ ముద్రణ సంస్థలకు పాలిమర్ సబ్‌స్ట్రేట్ సరఫరా చేసిన అనుభవం కలిగి ఉండాలి. అలాగే మొత్తం అవసరంలో కనీసం 30 శాతం అంటే 20,400 రీముల సరఫరా సామర్థ్యం ఉండాలి. అదనంగా, ల్యాబ్ పరీక్షల కోసం పాలిమర్ షీట్ నమూనాలను సమర్పించాలి. వాటిలో జంతువుల కొవ్వు లేదా ఐచీూ లేదని ధృవీకరించే సర్టిఫికెట్ కూడా తప్పనిసరిగా ఇవ్వాలి.

ఆర్‌బీఐ గవర్నర్ ఏమన్నారు?

ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఇటీవల జరిగిన ద్రవ్య విధాన సమీక్ష అనంతరం మాట్లాడుతూ, పాలిమర్ కరెన్సీ నోట్ల ప్రతిపాదన పరిశీలనలో ఉందని చెప్పారు. ఈ నోట్ల ప్రయోజనాలు, భద్రత, దీర్ఘకాలిక ఉపయోగం వంటి అంశాలను పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రపంచంలో ఎక్కడ మొదలయ్యాయి?

ప్రపంచంలో మొదటిసారిగా 1988లో ఆస్ట్రేలియా పాలిమర్ కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం 50కి పైగా దేశాలు ప్లాస్టిక్ కరెన్సీని ఉపయోగిస్తున్నాయి. సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే ఇవి ఎక్కువ కాలం మన్నుతాయి, నీటితో త్వరగా పాడవు, నకిలీ చేయడం కష్టమవుతుంది. దీంతో దీర్ఘకాలంలో కరెన్సీ ముద్రణ ఖర్చు కూడా తగ్గుతుంది.

బిడ్లకు గడువు

పాలిమర్ నోట్ల తయారీకి సంబంధించి గ్లోబల్ టెండర్‌లో పాల్గొనే సంస్థలు ఆగస్టు 18లోపు తమ బిడ్లను సమర్పించాల్సి ఉంటుంది. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే, భవిష్యత్తులో భారత్‌లో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు సాధారణ చలామణిలోకి వచ్చే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి.

# జగన్ వారసుడు బాబు

మొదటి పేజీ తరువాయి

అమ్మఒడి పేరుతో మోసానికి పాల్పడ్డ వైసీపీ ప్రభుత్వానికి బుద్ధిచెప్పి, కూటమికి పట్టం కడితే మీరు చేస్తున్నది ఏమిటని ప్రశ్నించారు.



రాష్ట్రంలో 83 లక్షల మంది బిడ్డలుంటే 67 లక్షల మందికి ఇవ్వడం ఎంతవరకు న్యాయమని, సుమారు 20 లక్షల మంది బిడ్డలకు ఎందుకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. 300 యూనిట్లు విద్యుత్, పొలాలు, కార్లు అంటూ కారణం చూపుతూ లబ్దిదారుల సంఖ్యను తగ్గించడం దారుణమని అన్నారు. నాన్న బుడ్డీని జగన్ దోచుకున్నారు సరే.. మీరు ఏకంగా బుడ్డీనే మాయం చేస్తున్నారని చంద్రబాబుపై విరుచుకుపడ్డారు.

# అందెశ్రీ నాకు స్ఫూర్తి.. పెద్దన్న లాంటి వ్యక్తి



**న్యూస్ డెస్క్, 18 జూలై (ఇది కద నిజం):** అందెశ్రీ గానాలు తనలో స్ఫూర్తిని నింపాయని అన్నారు. అందె శ్రీ తన పెద్దన్న అని ఆయనే తనకు స్ఫూర్తి అని చెప్పారు. అందెశ్రీ రచించిన జయజయహే తెలంగాణ రాష్ట్రగీతంగా మారి బడుల్లో, గుడుల్లో మోగుతుందని అంతా భావించారని కానీ దొర అహంకారంతో అందెశ్రీ పాటను, మాటను నిర్భందించారని ఆరోపించారు. అందెశ్రీ స్మృతివనం భూమిపూజ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పెన్నుల మీద మన్ను కప్పితే అవి గున్నులై మొలకెత్తినట్టు ఆ నిర్భందం నుండి తెంచుకుని ప్రతిగుడిలో, బడిలో అందెశ్రీ పాట వినిపిస్తుందని అన్నారు. అందెశ్రీ, గద్దర్ లాంటి యుద్ధనౌకలతో పెట్టుకున్నోడు కాలగర్భంలో కలిసిపోతాడని ఆ రోజే చెప్పామన్నారు.

అందెశ్రీ కుటుంబాన్ని నడిపేందుకు కష్టపడినా దొరల మోకాళ్ల వద్ద మోకరిల్లను అని అన్నాడని చెప్పారు. ప్రజలపై ఆధిపత్యం చెలాయించాలని కొందరు చూశారని, తెలంగాణను తమ కుటుంబమే తరతరాలు పాలించాలని భావించారన్నారు. అలాంటి సమయంలోనే అందెశ్రీ లాంటివాళ్లు వచ్చారన్నారు. ఈరోజు మేకతోలు కప్పుకున్న తోడేళ్ల లాంటి వాళ్లు బయటకు వచ్చారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ నోటిఫికేషన్ లు ఇస్తే రేవంత్ రెడ్డి ఉద్యోగాలు ఇచ్చారని మాట్లాడుతున్నారని, ఆనాడు మీ చెల్లిని నిజామాబాద్ లో ఓడిస్తే ఎమ్మెల్సీ ఉద్యోగం ఇచ్చారన్నారు.

మీ బంధువు వినోద్ కుమార్ ను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిస్తే ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ గా మూడు నెలల్లోనే ఉద్యోగం ఇచ్చారన్నారు. వందల మంది మీ బంధులకు ఉద్యోగాలు ఇచ్చారన్నారు. కానీ యువత ఉద్యోగాల కోసం ఒక్కరోజు కూడా ఆలోచించలేదన్నారు. నోటిఫికేషన్ లు ఇచ్చి జిరాక్స్ సెంటర్లలో ప్రశ్నాపత్రాలను పల్లి బఠాణీల్లా పంచారని ఆరోపించారు. విద్యార్థులు పదేళ్ల పాటు కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరిగి మీరు ఏనాడైనా వారి గురించి ఆలోచించారా అని అన్నారు. 2011 ఉమ్మడి రాష్ట్రంలో గ్రూప్ 1 పరీక్షలు నిర్వహిస్తే 2026లో తాము నోటిఫికేషన్ ఇచ్చి నియామకాలు చేపట్టే వరకు 16ఏళ్లు అయ్యిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే దాదాపు 70వేల ఉద్యోగాలిచ్చామని చెప్పారు.

# మెక్సికోలో భారీ భూకంపం..



**న్యూస్ డెస్క్, 18 జూలై (ఇది కద నిజం):** మెక్సికో దక్షిణ తీరాన్ని శు క్రవారం భారీ భూకంపం కుదిపేసింది. రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రత నమోదైంది. భూకంపం కారణంగా అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. భూకంప ప్రభావం మెక్సికోతో పాటు గ్వాటెమాలా, ఎల్ సాల్వడార్ దేశాల్లోనూ తీవ్రంగా కనిపించింది. అమెరికా భూకంప పరిశోధన సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. మెక్సికోలోని ప్యూర్టో మాడెరో నగరానికి సమీపంలో భూమికి కేవలం 10 కిలోమీటర్ల లోతులో ఈ భూకంపం సంభవించింది. తక్కువ లోతులో సంభవించడం వల్ల భూమి తీవ్రంగా కంపించడంతో పాటు సునామీ ప్రమాదం కూడా పెరిగిందని అధికారులు తెలిపారు.

సునామీ హెచ్చరికలు

భూకంపం అనంతరం అమెరికా సునామీ వార్నింగ్ సిస్టమ్ అప్రమత్తమైంది. భూకంప కేంద్రానికి 300 కిలోమీటర్ల పరిధిలోని తీర ప్రాంతాలకు సునామీ ముప్పు ఉన్నట్లు హెచ్చరించింది. మెక్సికో, గ్వాటెమాలా తీరాల్లో సాధారణ అలల కంటే ఒక మీటర్ వరకు ఎత్తైన అలలు వచ్చే అవకాశం ఉందని పేర్కొంది. ప్రధాన భూకంపం తర్వాత పలు ఆఫ్టర్‌షాక్‌లు నమోదయ్యాయి. వాటిలో అత్యంత బలమైనది 6.1 తీవ్రతతో నమోదైంది. అదనంగా 5.2, 4.5 తీవ్రతలతో మరికొన్ని ప్రకంపనలు సంభవించినట్లు భూకంప పరిశీలనా సంస్థలు వెల్లడించాయి.

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోల్లో భవనాలు బలంగా ఊగిపోవడం, గోడలపై ఉన్న వస్తువులు కిందపడిపోవడం కనిపించింది. భయంతో ప్రజలు ఇళ్ల నుంచి, కార్యాలయాల నుంచి బయటకు పరుగులు తీశారు. గ్వాటెమాలా రాజధాని గ్వాటెమాలా సిటీలో కూడా భవనాలు కంపించడంతో అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఎల్ సాల్వడార్‌లోనూ భూకంప ప్రకంపనలు స్పష్టంగా నమోదయ్యాయి.

మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షెయిన్‌బామ్ మాట్లాడుతూ.. చియాపాస్, టబాస్కో రాష్ట్రాల్లో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం లేదా భారీ ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం లేదని తెలిపారు. పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. గ్వాటెమాలా అధ్యక్షుడు బెర్నార్డో అరేవాలో కూడా ఇప్పటివరకు ఎలాంటి మరణాలు నమోదుకాలేదని, పరిస్థితిని నిమిషానికోసారి పరిశీలిస్తున్నామని వెల్లడించారు. ప్రజలు ప్రశాంతంగా ఉండి అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

భూకంప శాస్త్రవేత్తల ప్రకారం 7.4 తీవ్రతతో సంభవించే భూకంపాలు 'మేజర్ ఎర్త్‌క్వేక్'గా పరిగణిస్తారు. ఇలాంటి భూకంపాలు పెద్ద ఎత్తున విధ్వంసానికి కారణమయ్యే అవకాశం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# పాక్ కాల్పులు.. భారత సైన్యం ప్రతిదాడి

**న్యూస్ డెస్క్, 18 జూలై (ఇది కద నిజం):** భారత్- పాకిస్థాన్ నియంత్రణ రేఖ వెంబడి మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆపరేషన్ సింధూర్ అనంతరం తొలిసారిగా పాకిస్థాన్ సైన్యం భారీగా కాల్పులకు పాల్పడగా, భారత సైన్యం ధీటుగా ప్రతిస్పందించింది. ఈ ఘటన జమ్మూ కాశ్మీర్‌లోని రాజౌరి జిల్లా తర్కుండి సెక్టార్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. నివేదికల ప్రకారం, శుక్రవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో పాకిస్థాన్ సైన్యం నియంత్రణ రేఖ వెంబడి కాల్పులు ప్రారంభించింది. ప్రారంభంలో భారత సైన్యం దీనిని రెచ్చగొట్టే చర్యగా భావించి సంయమనం పాటించింది. అయితే కాల్పులు తీవ్రతరం కావడంతో భారత జవాన్లు గట్టిగా ప్రతిస్పందించారు. రెండు దేశాల సైన్యాల మధ్య జరిగిన ఈ ఫైర్ ఎక్స్ఛేంజ్ రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగినట్లు సమాచారం.

దృష్టి మళ్లించే ప్రయత్నమా?

భద్రతా వర్గాల అంచనా ప్రకారం, పాకిస్థాన్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్ లో నెలకొన్న పరిస్థితుల నుంచి జాతీయ, అంతర్జాతీయ దృష్టిని మళ్లించేందుకు పాకిస్థాన్ సైన్యం ఈ కాల్పులకు పాల్పడినట్లు భావిస్తున్నారు.

అప్రమత్తమైన భారత సైన్యం

సరిహద్దు ప్రాంతాల్లో పరిస్థితిని భారత సైన్యం నిశితంగా పర్యవేక్షిస్తోంది. గతంలో కూడా పాకిస్థాన్ వైపు నుంచి పలుమార్లు చొరబాటు ప్రయత్నాలు జరిగినప్పటికీ, భారత భద్రతా బలగాలు వాటిని విజయవంతంగా తిప్పికొట్టాయి. తాజా కాల్పుల నేపథ్యంలో నియంత్రణ రేఖ వెంబడి భారత సైన్యం అప్రమత్తతను మరింత పెంచింది. సరిహద్దు ప్రాంతాల్లో అదనపు నిఘా, భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసినట్లు తెలుస్తోంది.

ఆపరేషన్ సింధూర్ తర్వాత తొలి ఘటన

గత ఏడాది నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ అనంతరం నియంత్రణ రేఖ వెంబడి ఈ స్థాయిలో భారీ కాల్పులు జరగడం ఇదే తొలిసారి. దీంతో సరిహద్దు ప్రాంతాల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే, ఈ ఘటనలో ప్రాణనష్టం లేదా గాయాలపై ఇప్పటివరకు అధికారిక సమాచారం వెలువడలేదు. పరిస్థితిని భద్రతా దళాలు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయి.

# గుడిసెలులేని తెలంగాణ లక్ష్యం



**న్యూస్ డెస్క్, 18 జూలై (ఇది కద నిజం):** తెలంగాణ రాష్ట్రంలో గుడిసెలు లేకుండా ప్రతి నిరుపేద కుటుంబానికి పక్కా ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో రూ.184.15 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శంకుస్థాపన అనంతరం మంత్రులు ర్యాలీగా పరిగి పట్టణంలో పర్యటించి ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ పక్కా ఇళ్ల నిర్మాణం చేపడుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందించే దిశగా రెండో విడత కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. వికారాబాద్ జిల్లా అభివృద్ధి కోసం రోడ్ల నిర్మాణానికి రూ.900 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా పరిగి నియోజకవర్గానికి రూ.184.15 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు.

పరిశ్రమలు వస్తే ఉపాధి పెరుగుతుంది

రవాణా వ్యవస్థ మెరుగుపడితే పరిశ్రమలు, వ్యాపారాలు అభివృద్ధి చెంది స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. అర్హులైన పేదలకు రేషన్ కార్డులు అందించడంతో పాటు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. పరిగి ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుని యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేసిందని, రాష్ట్రంలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని మంత్రి వివరించారు. పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రాజెక్టులు, పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూసేకరణలో సహకరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్థలాన్ని పరిశీలించిన అధికారులు



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూలై 18: పిట్లం మండల కేంద్రంలో ప్రతిపాదిత తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలాన్ని ఆర్డీవో రవీందర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రవీంద్ర మోహన్ పరిశీలించారు. పాఠశాల నిర్మాణానికి అవసరమైన స్థల వివరాలు, మౌలిక సదుపాయాలను పరిశీలించి, పనులు త్వరితగతిన చేపట్టేందుకు సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్ కుమార్ పిట్లం గ్రామ సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# ఇంటి వద్దే చెత్త వేరు చేస్తేనే పరిశుభ్రమైన గ్రామం: ఎంపీడీవో సాయన్న



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కామారెడ్డి జిల్లా, పిట్లం మండలం, జూలై 18: కంబాపూర్ గ్రామాన్ని ఎంపీడీవో సాయన్న సందర్శించి గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ప్రతి ఇంటి నుంచి వచ్చే తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ చెత్త, ప్రత్యేక జాగ్రత్త చెత్తలను వేర్వేరుగా సేకరించి గ్రామపంచాయతీ సిబ్బందికి అప్పగించాలని ప్రజలకు సూచించారు. చెత్తను మూలస్థాయిలోనే వేరు చేయడం వల్ల గ్రామ పరిశుభ్రత మెరుగుపడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. ప్రతి కుటుంబం ఈ విధానాన్ని తప్పనిసరిగా పాటించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, సుజాత పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత

## రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు తొండ రవి




ఇది కద నిజం, హైదర్‌గూడ: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు, రాజేంద్రనగర్ అసెంబ్లీ ఎస్.ఐ.ఆర్ ఇన్‌చార్జి తొండ రవి పిలుపునిచ్చారు. హైదర్‌గూడలోని డోనాల్డ్ స్కూల్ వేదికగా బూత్ నంబర్లు 238, 239, 240, 241ల కోసం భారతీయ జనతా పార్టీ ఏర్పాటు చేసిన 'ఎన్యుమరేషన్ హెల్ప్ డెస్క్'ను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేర్ల నమోదు, సవరణల కోసం ఏర్పాటు చేసిన ఎన్యుమరేషన్ ఫారమ్స్ నింపడంలో ఓటర్లు చొరవ చూపాలని సూచించారు. సకాలంలో ఫారమ్స్ సమర్పించకుంటే ఓట్లు డిలీట్ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించిన ఆయన, ప్రజలకు ఏవైనా సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్ ద్వారా నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఓటర్ ఐడి లేదా ఆధార్ కార్డుతో వస్తే, సంబంధిత బి.ఎల్.ఓ వివరాలను యాప్ ద్వారా పరిశీలించి, ఫారమ్స్ ఎక్కడ అందజేయాలో తమ కార్యకర్తలు పూర్తి సహకారం అందిస్తారని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఫారమ్స్ సమర్పించిన వారికి మాత్రమే ఆగస్టు 10 తర్వాత ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సోషల్ మీడియా జాయింట్ కన్వీనర్ మధుమోహన్ రెడ్డి, వరుణ్ రాజే, రంగారెడ్డి జిల్లా బిజెపి ఆఫీస్ సెక్రటరీ సాబాద విజయ్ కుమార్, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సులిగే వెంకటేష్, బి.ఎల్.ఏ 2 నారాగూడెం సోంనాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు చిట్టిగారి శేఖర్, కవేలిగూడెం బాలు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నందనం గౌడ సంఘానికి నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



**ఇది కద నిజం న్యూస్ ఐనవోలు/జూలై 18**

హన్మకొండ జిల్లా:ఐనవోలు మండలం నందనం గ్రామంలో గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సంఘ అధ్యక్షుడిగా బుర్ర కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా బుర్ర సునీల్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బండి సంతోష్, కోశాధికారిగా బుర్ర యశోబరం ఎన్నికయ్యారు.డైరెక్టర్లుగా న్యాలం సంపత్,దోనికేన కుమారస్వామి, మెరుగు సుధాకర్,బుర్ర రమేష్, రంగు సంతోష్ లను ఎంపిక చేశారు. ముఖ్య సలహాదారులుగా బండపెల్లి సమ్మయ్య,యాదగిరి వ్యవహరించనున్నారు.కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.గ్రామ అభివృద్ధికి,సంఘ ఐక్యతకు కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు బుర్ర కుమారస్వామి తెలిపారు.

# ఓటరు జాబితా సమగ్ర సవరణను గడువులోగా పూర్తి చేయాలి

## ఐదు జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు హరి చందన దాసరి

**ఇది కద నిజం న్యూస్ హనుమకొండ**

ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ-2026 కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా మరియు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ (ఎన్నికల పరిశీలకులు),తెలంగాణ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, మానవ వనరుల శాఖ కార్యదర్శి శ్రీమతి హరి చందన దాసరి అధికారులను ఆదేశించారు.శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో హనుమకొండ, వరంగల్,జయశంకర్ భూపాలపల్లి, ములుగు,మహబూబాబాద్ జిల్లాల్లో ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమ పురోగతిపై ఆమె జిల్లా వారీగా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటింటి సర్వే,ఫారాల పంపిణీ, స్వీకరణ,మ్యాపింగ్, డిజిటలైజేషన్, అర్హులైన ప్రతి ఓటరు చేరిక, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా హరి చందన దాసరి మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని,ఇందుకోసం తరచుగా అడిగే ప్రశ్నల (ఎఫ్ఏక్యూ) సమాచారాన్ని ప్రచారం చేయాలన్నారు.శాశ్వతంగా నివాసం మారిన వారు, వలస వెళ్లిన వారు స్వచ్ఛందంగా వివరాలు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓలు) పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని,అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు,నివాసితుల సంక్షేమ సంఘాలు (ఆర్‌డబ్ల్యూఏలు), గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఒక్క అర్హుడైన ఓటరు కూడా నమోదు కాకుండా మిగిలిపోకుండా చూడాలని స్పష్టం చేశారు.రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ, వారి నుంచి వచ్చే అభ్యంతరాలు,ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తమ జిల్లాలోని సవరణ ప్రక్రియను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ పూర్తయిందని,డిజిటలైజేషన్ పనులను 72 శాతం పూర్తి చేశామని, మిగిలిన భాగాన్ని సకాలంలో ముగిస్తామని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ఆర్డీఓలు, మండల




స్థాయిలో తహసీల్దార్లు,మున్సిపల్ స్థాయిలో కమిషనర్లు ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని కలెక్టర్ రాహుల్ శర్మ వివరించారు.ఈ సమీక్షా సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ములుగు జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జి, హన్మకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు రవి,సంధ్యారాణి,ఈఆర్ఓలు,ఏఈఆర్ఓలు,ఎన్నికల విభాగ పర్యవేక్షకులు,సిబ్బంది పాల్గొన్నారు.

# కాకర్లపల్లి పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుంటే ఉద్యమం ఉధృతం"

## పాడుబడిన పాత ఎన్టీఆర్ కాలువను పరిశీలించిన ప్రజా సంఘాల నాయకులు -- వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు హెచ్చరిక"

సత్తుపల్లి,జూలై18(ఇది కద నిజం) న్యూస్: కాకర్లపల్లి గ్రామంలోని నిరుపేదలకు తక్షణమే ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని, లేకుంటే ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

శుక్రవారం సాయంత్రం కాకర్లపల్లికి వచ్చిన ఆయన రాష్ట్ర, జిల్లా ప్రజా సంఘాల నాయకులతో కలిసి నిరుపయోగంగా పడి ఉన్న 34 ఎకరాల పాత ఎన్టీఆర్ కాలువను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, వ్యవసాయ కార్మిక సంఘం, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో గత ఏడాది కాలంగా ఇండ్ల స్థలాల కోసం నిరంతర పోరాటాలు సాగుతున్నాయని తెలిపారు.

నిరుపయోగంగా ఉన్న పాత ఎన్టీఆర్ కాలువను వెంటనే పూడ్చి, కాకర్లపల్లి గ్రామ పేదలతో పాటు సత్తుపల్లి ప్రాంతంలోని నిరుపేద కుటుంబాలకు ఇండ్ల స్థలాలుగా కేటాయించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌లకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.





ప్రభుత్వ యంత్రాంగం సానుకూలంగా ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే, మంత్రులు, ప్రజాప్రతినిధులు తీవ్ర నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ జిల్లా నుంచి ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి వంటి ముగ్గురు కీలక మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ పేదల ఇళ్ల సమస్యపై స్పందించకపోవడం దురదృష్టకరమని అన్నారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా పేదలకు ఇళ్లు, ఇండ్ల స్థలాలు ఇస్తామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు పథకం కింద అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు మంజూరు చేసి, నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.సత్తుపల్లి ఉద్యమాల గడ్డ అని, ప్రజల సహనాన్ని పరీక్షించకుండా వెంటనే ఇండ్ల స్థలాల పంపిణీ చేపట్టాలని, లేకుంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వెంకట్రాములు హెచ్చరించారు.

ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి మాట్లాడుతూ కాకర్లపల్లి పేదల ఇండ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు.ఐద్వా మండల కార్యదర్శి జాజిరి జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు మేరుగు సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా నాయకులు మోరంపూడి పాండురంగారావు, కొలికపోగు సర్వేశ్వరరావు, రైతు సంఘ నాయకుడు రావుల రాజబాబు, వ్యకాస మండల కార్యదర్శి కువ్వారపు లక్ష్మణరావు, నాయకులు తడికమళ్ల రామకృష్ణ, వేపులపాటి కుమారస్వామి, బండి వేలాద్రి, ప్రజానాట్య మండలి డివిజన్ అధ్యక్షుడు కండే సత్యం, కార్యదర్శి అయినంపూడి సనందనరావు, అలివేలు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

# కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఉంది కడియం శ్రీహరి తీరు





-మాజీ తొలి ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య

**ఇది కద నిజం న్యూస్ రఘునాథపల్లి, జూలై 18**

రఘునాథపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించిన తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య, అనంతరం ఖిలా షాపూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రభుత్వంపై, ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై విమర్శలు చేశారు.డాక్టర్ రాజయ్య మాట్లాడుతూ, ఇప్పటివరకు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో 72 శాతం మాత్రమే ఓటరు నమోదు పూర్తయిందని, రాష్ట్రవ్యాప్తంగా 40 శాతానికి మించి నమోదు జరగలేదని అన్నారు.దీనికి ప్రధాన కారణం బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) సరైన శిక్షణ ఇవ్వకుండా ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించడమేనని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో ఎన్నికల సంఘం ఓటరు నమోదు గడువును మరింత పొడిగించాలని కోరారు.రాబోయే ఎన్నికల్లో ఓటర్ల జాబితాలో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా ఉండాలంటే బీఎల్ఓలతో పాటు బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కూడా ప్రతి గ్రామంలో ఓటరు నమోదును పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలందరూ ఈ కార్యక్రమానికి సహకరించాలని పిలుపునిచ్చారు.అనంతరం దేవాదుల ప్రాజెక్టు అంశంపై మాట్లాడిన ఆయన, నియోజకవర్గంలో రైతులు వర్షాభావంతో ఇబ్బందులు పడుతున్నా ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించడం లేదని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దేవాదుల ప్రాజెక్టు కోసం రూ.17 వేల కోట్లు కేటాయించామని గుర్తుచేశారు.దేవాదుల ప్రాజెక్టు మూడో దశ పనులు పూర్తయ్యేందుకు సుమారు రూ.2,500 కోట్లు అవసరమైతే, పలుమార్లు మంత్రులను తీసుకెళ్లినా కేవలం రూ.194 కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. అందుకే "కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు" కడియం శ్రీహరి వ్యవహారం ఉందని వ్యాఖ్యానించారు.మూడో దశ పనులు పూర్తయితే సుమారు ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్న రాజయ్య, మూడు మోటార్లు పనిచేయాల్సిన చోట ఒక్క మోటార్‌తోనే నీటిని ఎత్తిపోతల చేస్తున్నారని ఆరోపించారు. గత సంవత్సరం దేవన్నపేట వద్ద మోటార్లను ప్రారంభించిన సమయంలో పైపులు పగిలాయని, ఇప్పటికీ వాటి మరమ్మతులు పూర్తి కాలేదని అన్నారు.అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైనా విమర్శలు చేస్తూ, ఆయన ఉన్న చోట అభివృద్ధి కంటే విధ్వంసమే ఎక్కువగా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు.

# అనుమతి లేని ఫిజిక్స్ వాలా జూనియర్ కాలేజీని మూసివేయాలి-స్వేరో స్టూడెంట్స్ యూనియన్

**హనుమకొండ, జూలై 18 (ఇది కద నిజం)**




హనుమకొండ నగరంలో అనుమతులు లేకుండా ఫిజిక్స్ వాలా జూనియర్ కాలేజీని నిర్వహిస్తున్నారని, సంబంధిత యాజమాన్యంపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ డిమాండ్ చేశారు.శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కాలేజీకి అవసరమైన అనుమతులు, మౌలిక సదుపాయాలు లేకుండానే విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆకర్షిస్తూ అడ్మిషన్లు చేపడుతున్నారని ఆరోపించారు. డే స్కాలర్ విద్యార్థుల నుంచి రూ.1.15 లక్షల ఫీజుతో పాటు రూ.15 వేల డొనేషన్ పేరుతో భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.కాలేజీ చైర్మన్‌ను కలవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరితే, "చైర్మన్ ఇక్కడ ఉండరు, వారికి సంబంధం లేదు" అంటూ యాజమాన్యం వివిధ రకాలుగా సమాధానాలు ఇస్తోందని ఆరోపించారు. అలాగే రెండు వేర్వేరు పేర్లతో కాలేజీ బస్సులు నడుపుతున్నారని, దీనివల్ల విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అయోమయం నెలకొందన్నారు.ఈ అంశంపై జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి (డీఐఈఓ) వెంటనే స్పందించి, కాలేజీ అనుమతులపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే తక్షణమే కాలేజీని మూసివేసి విద్యార్థులకు న్యాయం చేయాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ డిమాండ్ చేసింది.

# ఎద్దు పొడవడంతో రైతుకు తీవ్ర గాయాలు- 108 సిబ్బంది తక్షణ సేవలు

## 108 అంబులెన్స్ సిబ్బంది ప్రాణం కాపాడారు - కుటుంబ సభ్యుల అభినందనలు



**ఇది కద నిజం న్యూస్ ఐనవోలు/జూలై 18**

హన్మకొండ జిల్లా:ఐనవోలు మండలం కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన కాటబోయిన శ్రీను 55 వ్యవసాయ పనులు చేస్తుండగా ఘోర ప్రమాదం జరిగింది.పొలం దున్నుతుండగా ఎద్దు ఒక్కసారిగా వెనక్కి తిరిగి పొడవడంతో శ్రీను తలకు తీవ్రమైన గాయమైంది. అంతేకాకుండా శరీరంపై పలు చోట్ల ఎద్దు తొక్కడంతో తీవ్రంగా గాయపడ్డారు.

సమాచారం అందుకున్న వెంటనే ఐనవోలు 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన కక్కిరాలపల్లి పెద్దమ్మ గుడి వద్దకు చేరుకుని గాయపడిన శ్రీనును అంబులెన్స్ లో ఎక్కించుకుని బ్లీడింగ్ కంట్రోల్ చేస్తూ ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఎంజిఎం ఆస్పత్రికి తరలించారు.ఈ ఘటనలో 108 సిబ్బంది అందించిన సేవలకు గాయపడిన శ్రీను కుమారుడు సాంబరాజు మరియు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఇ ఎమ్ టీ ఏనుగు రాజు,పైలెట్ యాదవ రెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు.



# సినిమా న్యూస్



## షూటింగ్‌కి ముందే హైప్

టాలీవుడ్ హీరో నితిన్ ప్రస్తుతం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో రాము–సోము దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. అలాగే దండోరా ఫేమ్ మురళికాంత్ దర్శకత్వంలో మరో సినిమాకు కూడా ఆయన ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ చిత్రాన్ని నేచరల్ స్టార్ నాని తన వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై నిర్మించనున్నట్లు సమాచారం. ఇటీవల కాలంలో సినిమా షూటింగ్ ప్రారంభానికి ముందే గ్లింప్స్ లేదా కాన్సెప్ట్ వీడియోలను విడుదల చేసి ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచడం మేకర్స్ అనుసరిస్తున్న వ్యూహంగా మారింది.


ఇదే ఫార్ములాను నితిన్–మురళికాంత్ కాంబినేషన్‌లో రూపొందనున్న చిత్రానికి కూడా అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్ వీడియో చిత్రీకరణ జరుగుతున్నట్లు సమాచారం. అది పూర్తైన వెంటనే గ్లింప్స్‌ను విడుదల చేస్తూనే సినిమాను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ గ్లింప్స్‌కు మంచి స్పందన లభిస్తే సినిమా ప్రారంభానికి ముందే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.





## 'వారణాసి' నుంచి బర్త్‌డే స్పెషల్


బాలీవుడ్ స్టార్ నటి ప్రియాంక చోప్రా ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా, దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ చిత్రం 'వారణాసి'లో హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. కొంతకాలం క్రితం ఈ సినిమా నుంచి ప్రియాంక చోప్రాకు సంబంధించిన ఓ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. అందులో ఆమె పసుపు రంగు చీరలో, చేతిలో గన్ పట్టుకుని కనిపించగా, ఆ పోస్టర్ అప్పట్లో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. ఆ తర్వాత ఆమెకు సంబంధించిన ఎలాంటి పోస్టర్‌ను విడుదల చేయలేదు. అయితే శనివారం ప్రియాంక చోప్రా పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ రెండు కొత్త పోస్టర్లను విడుదల చేసింది.

మొదటి పోస్టర్‌లో ప్రియాంక చోప్రా ప్రకృతి ఒడిలో ఉల్లాసంగా గాల్లోకి ఎగిరిన క్షణాన్ని ఎంతో అందంగా ఆవిష్కరించారు. వెనుకన కనిపించే పర్వత శ్రేణులు, మైదానంలో సంచరిస్తున్న జీబ్రాలు, జిరాఫీల మధ్య చిరునవ్వుతో కనిపిస్తున్న ఆమె లుక్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇక రెండో పోస్టర్‌లో ప్రియాంక చోప్రా పూర్తి భిన్నమైన స్టైలిష్ అవతారంలో దర్శనమిచ్చారు. బ్లాక్ కాస్ట్యూమ్‌లో ఇంటెన్స్ లుక్, కళ్లలోని తీవ్రత, డార్క్ బ్యాక్‌డ్రాప్ కలిసి పోస్టర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ రెండు పోస్టర్ల ద్వారా సినిమాలో ప్రియాంక చోప్రా విభిన్న షేడ్స్‌తో కూడిన శక్తివంతమైన పాత్రలో కనిపించబోతున్నారనే సంకేతాలను మేకర్స్ ఇచ్చినట్లు సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.





## మైత్రి చేతికి 'ది ప్యారడైజ్'



నేచురల్ స్టార్ నాని, ఖయాదు లోహర్ జంటగా నటిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. మొదట ఈ సినిమాను ఆగస్టు 21న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించినప్పటికీ, ఆ తేదీన విడుదల కావడం కష్టమేనని ఇటీవల వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న విడుదల చేసే దిశగా మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఈ మూవీ నైజాం థియేట్రికల్ హక్కులు రికార్డు ధరకు అమ్ముడైనట్లు సమాచారం. ప్రస్తుతం వినిపిస్తున్న సమాచారం ప్రకారం, మైత్రి డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఈ సినిమా నైజాం థియేట్రికల్ హక్కులను ఏకంగా రూ.37 కోట్ల భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నైజాం ఏరియాలో ఈ చిత్రం బ్రేక్ ఈవెన్ సాధించి హిట్ స్టేటస్ అందుకోవాలంటే దాదాపు రూ.70 కోట్ల గ్రాస్ కలెక్షన్లు రాబట్టాల్సి ఉంటుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంతటి వసూళ్లను సాధించాలంటే సినిమాకు సూపర్ హిట్ టాక్ రావడం తప్పనిసరి అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## డిసెంబర్ రేసులో బాలయ్య

నందమూరి బాలయ్య గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇండస్ట్రీలో సీనియర్ హీరోగా కొనసాగుతున్న ఆయన.. ఏడాదికి ఒక్క సినిమా అయినా రిలీజ్ చేస్తున్నారు. వరుసగా సినిమాలు చేసుకుంటూనే.. రాజకీయాల్లో తన పాత్ర అద్భుతంగా పోషిస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం నందమూరి బాలయ్య గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఎన్బికే 111 వర్కింగ్ టైటిల్ తో ఈ సినిమా వస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఈ మూవీ ఉంది. ఇలాంటి నేపథ్యంలో బిగ్ అప్డేట్ వచ్చేసింది.

డిసెంబర్ మూడో వారంలో ఈ సినిమా రిలీజ్ కానున్నట్లు ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. ప్రభాస్ చేస్తున్న ఫౌజీ సినిమా డిసెంబర్ మూడవ తేదీన రిలీజ్ కానున్నట్లు ఇప్పటికే చిత్రం బృందం ప్రకటించింది. అయితే ఈ సినిమా రిలీజ్ అయిన రెండు వారాల తర్వాత నందమూరి బాలయ్య సినిమా రిలీజ్ చేసేందుకు చిత్రం బృందం ప్లాన్ చేస్తోంది. నందమూరి బాలయ్య ఎక్కువ హిట్ టాక్ వస్తే సంక్రాంతి వరకు థియేటర్ ఉంటుందని మేకర్స్ భావిస్తున్నారు. దీనిపై త్వరలోనే పోస్టర్ ద్వారా అఫీషియల్ ప్రకటన రానుంది. కాగా ఈ మూవీలో నందమూరి బాలయ్య సరసన కాజల్ నటిస్తున్నారు.




## 'బాలన్' ఓటీటీ రిలీజ్ ఫిక్స్

ఓటీటీల్లో ప్రతి వారం కొత్త సినిమాలు వస్తుంటాయి. అయితే కొన్ని సినిమాలు మాత్రం కథ, మేకింగ్, సస్పెన్స్‌తో ప్రేక్షకులను ప్రత్యేకంగా ఆకట్టుకుంటాయి. అలాంటి సినిమాల్లో ఇప్పుడు మరో మలయాళ సైకలాజికల్ థ్రిల్లర్ చేరబోతోంది. థియేటర్లలో ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసిన 'బాలన్: ది బాయ్' ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులకు కూడా ఈ సినిమా అందుబాటులోకి రానుండటంతో థ్రిల్లర్ అభిమానులు చూసేందుకు ఇంట్రెస్టింగ్ గా ఉన్నారు. ఇప్పటికే మలయాళ సినిమాలకు తెలుగు రాష్ట్రాల్లో మంచి ఆదరణ లభిస్తుండగా, ఈ మూవీ కూడా అదే జాబితాలో చేరుతుందా అనే చర్చ కూడా మొదలైంది.




జీ5లో స్ట్రీమింగ్

'మంజుమ్మెల్ బాయ్స్' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు చిదంబరం తెరకెక్కించిన తాజా చిత్రం 'బాలన్: ది బాయ్'. జూన్ 19న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా సైకలాజికల్ థ్రిల్లర్ జానర్‌లో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పుడు ఈ చిత్రం జూలై 31 నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక జీ5లో స్ట్రీమింగ్ కానుంది. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో కూడా ఒకేసారి విడుదల చేయనున్నట్లు సమాచారం. ఈ సినిమాపై మొదటి నుంచే మంచి అంచనాలు నెలకొనడానికి మరో ముఖ్య కారణం రచయిత జితు మాధవన్. 'ఆవేశం' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రానికి కథ అందించిన ఆయన ఈ చిత్రానికి కూడా రచయితగా పని చేశారు. చిదంబరం దర్శకత్వం, జితు మాధవన్ రచన కలయికతో రూపొందిన ఈ చిత్రం థియేటర్లలో ఆడియన్స్ ను బాగానే థ్రిల్ చేసింది.

ఈ చిత్రంలో ఆదిశేషన్ కె.ఆర్., ఫర్హానా పలాతింగల్, ముహమ్మద్ జినాన్ ప్రధాన పాత్రల్లో నటించారు. పెద్ద స్టార్ కాస్ట్ లేకపోయినా, యాక్టింగ్ తోనే ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇక టెక్నికల్ అంశాల పరంగా కూడా 'బాలన్: ది బాయ్' ప్రశంసలు అందుకుంది. 'మంజుమ్మెల్ బాయ్స్'కు సంగీతం అందించిన సుషిన్ శ్యామ్ ఈ చిత్రానికి కూడా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సమకూర్చారు. సినిమాటోగ్రాఫర్ షైజు ఖాలిద్ కేరళ ప్రాంతాలను డార్క్ టోన్‌లో చిత్రీకరించి కథ మూడ్‌ను పూర్తిగా మార్చేశారు.